క్లుప్తంగా

సామాజిక తనిఖీ గ్రామసభలు



గుండారంలో గ్రామసభ నిర్వహణ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, రొంపికుంట, పేంచికల్‌పేట, నాగారం, పేరపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలు, చేసిన ఖర్చు, కూలీల వివరాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచ్‌లు ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, కొండ వెంకటేశ్, తొగరి అన్నపూర్ణ, ఇటవేన కొమురమ్మ పాల్గొన్నారు.

8వ వార్డులో స్వచ్ఛ శుక్రవారం



క్లోరినేషన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని 8వ వార్డులో ప్రతీ శుక్రవారం నిర్వహించే స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా మేరవాడలో కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా క్లోరినేషన్ పనులు చేశారు.

రూ.3లక్షల నిధులు మంజూరు

పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని మేరవాడలో సీసీరోడ్డు పనుల కోసం రూ.3లక్షల నిధులను శాసనమండలి విప్ తానిపర్తి భానుప్రసాద్ రావు కేటాయించారని కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, సురేందర్ సన్నీ తెలిపారు. స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, అల్క జవాన్, ఇస్కిళ్ల జయరాజు, సిబ్బంది ఎల్లమ్మ సతీశ్ పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి పర్యవేక్షణలో, శ్రీ సజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో కేరళ పండితుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సుంకరి స్వామి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బీఆర్‌ఎస్ నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అందజేశారు.

నేడు వైఎస్సార్ జయంతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు తెలిపారు. వైఎస్సార్ అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

కాల్వశ్రీరాంపూర్: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటిలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని, పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు సమ్మెకు దిగడంతో పరిశుభ్రత కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ సూచించారు.కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండోవిడత గొర్రెల పంపిణీ



గొర్రెలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, పెంచికల్‌పేట గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం పంపిణీ చేసిన రెండోవిడత గొర్రెలను శుక్రవారం ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. రెండోవిడతలో మండలంలో 370 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా రెండు గ్రామాలకు 8 యూనిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచ్‌లు నీలం సరిత, కొండ వెంకటేశ్, ఎంపీటీసీ గొడిసెల ఉమ, పశువైద్యాధికారి మహేందర్, ఉప సర్పంచ్‌లు బొజ్జ సాగర్, లింగాల కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్‌తో బోధన సులభతరం

- జిల్లాలో 63 పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటు
- ల్యాబ్ గదిలోకి వెళ్లకుండానే అర్థమయ్యేలా బోధన



ధూళికట్ట జెడ్పీ హెచ్‌ఎస్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంఈవో (ఫైల్)

ఎలిగేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో తరగతికి దాదాపు రూ.3లక్షల విలువగల డిజిటల్ స్క్రీన్లను మూడు తరగతి గదులకు ఏర్పాటు చేశారు.

బోధన సులభం..

డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేందుకు తోడ్పడుతాయని టీచర్లు అంటున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులు వింటారు. బోధనతోపాటు ప్రత్యక్షంగా చూపించడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుంది. బోర్డుపై బొమ్మ గీయనవసరం లేకుండా ఉపాధ్యాయులు బొమ్మను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు చూపించవచ్చు. సబ్జెక్టు నిపుణులతో విద్యార్థులను మాట్లాడించవచ్చు. విద్యార్థులు ల్యాబ్ గదిలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా తరగతిగదిలోనే బోధన అర్థమయ్యేలా చూపించవచ్చు. డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున విద్యార్థులకు బోధించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. డిజిటల్ బోధనపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

63 పాఠశాలల్లో బోధనకు ఏర్పాట్లు..

జిల్లాలోని మన ఊరు–మన బడి కింద ఎంపికైన 63 పాఠశాలల్లో మొదటి విడతగా డిజిటల్ తరగతులు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో ఎంపికైన ఎలిగేడు, ధూళికట్ట జెడ్పీఉన్నత స్కూళ్లలో 8, 9, 10వ తరగతుల్లో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

ఎక్కువగా గుర్తుంటుంది



ఉపాధ్యాయులు చేప్పే పాఠాలు వినడం కంటే డిజిటల్ బోధనతో ఎక్కువగా గుర్తుంటుంది. సులభంగా అర్థమై జ్ఞాపకం ఉండటంతోపాటు చదవాలనే ఆసక్తి పెరుగుతుంది.
– హర్షిత
పదోతరగతి, జెడ్పీహెచ్‌ఎస్, ధూళికట్ట

అర్థమయ్యేలా బోధించవచ్చు



విద్యార్థులకు బోధనతో పాటు డిజిటల్ స్క్రీన్‌పై ప్రత్యక్షంగా చూపించడం ద్వారా సులువుగా అర్థమవుతుంది. డిజిటల్ స్మార్ట్ టీవీ, గ్రీన్ బోర్డుతో టూడీ, త్రీడీ చిత్రాలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించవచ్చు.
– జి.శ్రీశైలం
మ్యాథ్స్ టీచర్, ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్

జ్ఞాపకశక్తి పెరుగుతుంది



మండలంలోని ఎలిగేడు, ధూళికట్ట పాఠశాలల్లో డిజిటల్ తరగతులకు ఏర్పాట్లు చేశాం. మిగతా పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.
– కవిత, ఎంఈవో, ఎలిగేడు

స్వశక్తి మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని సుమారు 3వేల మంది నిరుపేద స్వశక్తి మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుతో కలిసి స్వశక్తి మహిళా సమాఖ్యల అధ్యక్షురాళ్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో గార్మెంట్ ఇండస్ట్రీ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వశక్తి మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మెప్మా పీడీ, డీఎంసీ రజినీ, ఆర్పీలు, సీఓలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గోదావరిఖని: మెడికల్ కాలేజీ సీట్లలో సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక కోటా కేటాయించడాన్ని హర్షిస్తూ శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ క్షీరాభిషేకం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

గోదావరిఖని: బీఆర్‌ఎస్ పార్టీలో పలు పార్టీలకు చెందిన నాయకులు చేరగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మద్దిర్యాల్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మక్కెర సీతారామయ్య, లగిశెట్టి రాంకిషన్, ఎల్కలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉదయ్, బీజేపీ నాయకుడు అంజిలు పార్టీలో చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం కాంగ్రెస్ నాయకుడు కందుల అశోక్ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అశోక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు కొయ్యడ సతీశ్, చుంచు సదయ్య, ఉపసర్పంచ్ మాదాసు శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన ముంజంపల్లి అంజయ్యకు కుడికాలు ఇన్ఫెక్షన్ అయి మోకాలు వరకు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. పేదస్థితిలో ఉన్న అతడికి కృత్రిమ కాలు అమర్చడం కోసం శుక్రవారం నానేస్తం ట్రస్టు ద్వారా రూ.20వేలు నగదు అందజేశారు. సర్పంచ్ సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, ట్రస్టు పూర్వ అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ, బూర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అశోక్, సభ్యులు లక్ష్మీనారాయణగౌడ్, మల్లారెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



గోదావరిఖనిటౌన్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావం, మందకృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జెండా ఎగురవేశారు. కోకన్వీనర్ ముల్కల శ్రావణ్, నాయకులు గుండ్ల రాకేశ్, మంద రవికుమార్, కాజీపేట రాజయ్య, బాపు, శ్రీకాంత్, మల్లికార్జున్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రామగుండం: రైల్వేస్టేషన్ ఏరియా అక్బర్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొండల రాజేందర్ పార్టీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం గోదావరిఖని సిగ్మా ఆస్పత్రికి చెందిన ఉచిత హెల్త్‌కార్డులను స్థానిక ప్రజలకు అందజేశారు. అక్బర్‌నగర్ ఇంటెలిజెన్స్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ జెండా ఆవిష్కరించారు. మాజీ జెడ్పీటీసీ కొక్కిస రవీందర్‌గౌడ్, ఇనుగాల రమేశ్, దాసరి కిషన్, సందీప్, వివేక్, అరవింద్, ప్రదీప్, అజయ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ

గోదావరిఖనిటౌన్: విద్యాశాఖ శుక్రవారం ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్, సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో స్థానిక సప్తగిరికాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఈ.నవ్యశ్రీకి ఎంపీసీ విభాగంలో 467 మార్కులు వచ్చాయి. విద్యార్థినిని కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్, డైరెక్టర్ జమున, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి అభినందించారు.

రీ వెరిఫికేషన్‌లో పెరిగిన జీపీఏ

యైటింక్లయిన్‌కాలనీ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన శాంతినికేతన్ పాఠశాల విద్యార్థిని మామిడి శ్రీహర్షిత 9.7 జీపీఏ సాధించింది. విద్యార్థి ఒక సబ్జెక్టులో రీ వెరిఫికేషన్ కోసం అప్లై చేసింది. రీవెరిఫికేషన్ తర్వాత 9.8 జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి శుక్రవారం తెలిపారు.

చెట్టు విరిగి.. కారుపై పడి

పెద్దపల్లిరూరల్: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున వీచిన భారీ గాలులకు ప్రగతినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నూతన భవనం ఎదుట పార్కింగ్ చేసిన కారుపై చెట్టు విరిగిపడింది. కారు పూర్తిగా ధ్వంసమైంది.

సంక్షిప్త వార్తలు

✦ తపస్ సభను విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: పెద్దపల్లిలోని వైశ్య భవనంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 9న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు కోరారు. ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

✦ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని న్యూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజుభాయ్ పటేల్ డిమాండ్ చేశారు. ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర శుక్రవారం సుల్తానాబాద్ చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి నిర్మూలన, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని, ప్రతి దరఖాస్తుకు జవాబుదారీతనం ఉండాలన్నారు. కోర్టు తీర్పులు సైతం ఏడాదిలోపే వచ్చేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు జనగామ లక్ష్మీనారాయణ, కేంద్ర కమిటీ సభ్యురాలు గంట భవిత, రాష్ట్ర కన్వీనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

✦ ఉద్యమకారులకు పెన్షన్ అందజేయాలి

ఎలిగేడు: ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ రూ.20వేల పెన్షన్ అందజేయాలని ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపురెడ్డి సునీతరెడ్డి కోరారు. జార్ఖండ్‌లో అమలు చేసిన విధంగా రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సునీతారెడ్డి ఆధ్వర్యంలో ఎలిగేడు మండలం నారాయణపల్లిలో సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్తిరెడ్డి రమాదేవి, చింతిరెడ్డి మణెమ్మ, లక్ష్మి, సబ్బు బుచ్చమ్మ, చొప్పరి పద్మ, సబ్బు శ్రీలేఖ పాల్గొన్నారు.

✦ కుట్టుశిక్షణ పూర్తి

రామగుండం: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్వహణలో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మూడునెలల శిక్షణ పూర్తయిన సందర్భంగా శుక్రవారం గ్రామ కూడలిలో సమావేశం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్ ఇప్పించేందుకు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ గ్రామ ప్రతినిధి నిమ్మరాజుల సాగర్ అన్నారు.

సమాచారం

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: రామగుండం సబ్‌స్టేషన్‌లో పునరుద్ధరణ పనుల నిమిత్తం దాని పరిధిలో ఉన్న ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. మల్యాలపల్లి, బ్రద్రిపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, విద్యుత్‌నగర్, అయోధ్యనగర్, జీరోపాయింట్, హౌసింగ్‌బోర్డు కాలనీ, లింగాపూర్, అబాది రామగుండం, సండే మార్కెట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

✦ కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

✦ మంథనిలో..

మంథని: మంథని, గుంజపడుగు, నాగారం విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈఈ సీహెచ్.మల్లయ్య తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

బహుజనులకే రాజ్యాధికారం దక్కాలి



ఇంటింటి ప్రచారంలో ఉష

పెద్దపల్లిరూరల్: బడుగు బలహీనవర్గాల ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే బహుజనులకే రాజ్యాధికారం దక్కాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్‌లో ‘మన ఊరు.. మన ఉష’ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఉష అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాఘవాపూర్‌లోని ఇంటింటికీ వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కరపత్రాలను పంచారు. నాయకులు మొలుమూరి చంద్రశేఖర్, ఎండీ అజీమ్, ఆముదాల అరుణ, దేశబోయిన అఖిల, ప్రశాంత్, బొంకూరి సాగర్, బొంకూరి అన్వేష్, కొమురయ్య, రవికుమార్, చంద్రశేఖర్, మల్లేశం, రాహుల్ పాల్గొన్నారు.

సమాజసేవలో ముందుండాలి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఐ జగదీష్

సుల్తానాబాద్: పట్టణంలోని గోదావరి అర్బన్ బ్యాంక్ 10వ వార్షికోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సీఐ జగదీష్ మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతీ ఒక్కరు ముందుండాలన్నారు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తహసీల్దార్ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. పదో వార్షికోత్సవం సందర్భంగా ఒక రోజు అన్నదానం, రెండోరోజు మార్కెటింగ్ డే, మూడోరోజు రేపు డ్రాయింగ్ కాంపిటీషన్ కూడా నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ, గోదావరి అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఐల రమేశ్, తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, బ్యాంక్ మేనేజర్ అంతటి సంతోష్‌కుమార్, ఎస్సైలు విజేందర్, అశోక్‌రెడ్డి, వనిత, నాయకులు బిరుదు కృష్ణ, మొల్గూరి అంజయ్య, సిబ్బంది తిరుపతి, రమేశ్ గౌడ్, మౌనిక, వరలక్ష్మి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, నల్ల శ్రీనివాస్, బైరగోని రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్సై కొమురయ్య

రామగుండం: ఆటోడ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతీ ఆటోడ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలకు లోబడి డ్రైవింగ్ చేయాలని రామగుండం ఏఎస్సై కొమురయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం ఎస్సై బత్తుల శరణ్య ఆదేశాల మేరకు ఆటోడ్రైవర్లకు పలు అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుల్లు సాగి ప్రభాకర్‌రావు, సంపత్, సామ్రాట్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై శిక్షణ

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని రైతు భవన్‌లో మనుషుల అక్రమ రవాణా నిరోధంపై మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజ్వల కోఆర్డినేటర్ సురేశ్ కుమార్, సూపర్‌వైజర్లు అంజలి, సువర్ణ, కోఆర్డినేటర్ సురేశ్‌కుమార్, శ్రీకాంత్ హాజరయ్యారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



పాలకుర్తి: దీక్షలో పాల్గొన్న ముత్యంరావు

కాల్వశ్రీరాంపూర్: కరోనా కాలంలో ప్రాణాలు లెక్క చేయకుండా గ్రామాల్లో పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య పనులు చేసిన గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర సర్కార్ కనీస వేతన చట్టం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన దీక్షల్లో శుక్రవారం అయన పాల్గొని మద్దతు తెలిపారు.

మంథని: పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. మంథని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికుల సమ్మె శిబిరాన్ని శుక్రవారం సందర్శించి, మాట్లాడారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కాసిపేట అశోక్, నాయకులు సందీప్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. నాయకులు ఆనందం, రామస్వామి, సాంబయ్య, స్వామి పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ సంఘీభావం

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపడుతున్న కార్మికుల రిలే దీక్షలకు శుక్రవారం న్యూడెమోక్రసీ పార్టీ సంఘీభావం ప్రకటించింది. న్యూడెమోక్రసీ ప్రతినిధులు చంద్రయ్య, రమేష్, సాంబయ్య, రాజకొమురయ్య ఉన్నారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె రెండోరోజుకు చేరింది.

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయం ఎదుట తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. నాయకులు ఎదుల్ల రవి, మల్లయ్య పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష శిబిరంలో పాల్గొని నిరసన తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో గేట్ పాసులు, కనీస వేతనాల చెల్లింపు, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాల విషయంలో పారదర్శకత లేదన్నారు. కాంట్రాక్టర్లతో అనేకసార్లు చర్చించామని, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బదిలీ కావడంతో డిమాండ్స్‌పై చర్చించడానికి అవకాశం లేకుండా పోతోందని తెలిపారు. యాజమాన్యం గతంలోనే నెలరోజుల వ్యవధి కోరిందని, ఇప్పటివరకూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నాయకులు నరేష్, రామ్, శ్రావణ్, ఆర్.సురేష్, శ్రీకాంత్, సతీశ్, రూపేశ్ పాల్గొన్నారు.

బేగంపేటలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న మంథని సీఐ సతీశ్

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలం బేగంపేటలో శుక్రవారం మంథని సీఐ సతీశ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఆలం అంజి, పాముల భాస్కర్‌ల వద్ద 30 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సతీశ్ మాట్లాడుతూ నేరాల నిర్మూలనకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రామగిరి ఎస్సై కటికె రవిప్రసాద్, దివ్య, మంథని ఎస్సై ఆదిమధుసూదన్‌రావు, రాణి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుల్తానాబాద్: ప్రైవేట్ స్కూల్స్‌లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోగుల విజయ్‌కుమార్, సుంక మహేశ్ కోరారు. శుక్రవారం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకొని, నిత్యం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటున్న జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యులు నూక రామదాసు, సుంక శ్రీధర్, పల్లా మహేశ్, సాబీర్ బాషా, గోపికృష్ణ, సుమన్, సతీశ్, సంతోష్ పాల్గొన్నారు.